ప్రజాశక్తి
www.prajasakti.com
శనివారం 8 జూన్ 2024
5
వైఎస్ఆర్



బీమా లేని వాహనాలను నడిపితే శిక్షలు తప్పవు

- జిల్లా ఉప రవాణా కమిషనర్ మీరా ప్రసాద్

ప్రజాశక్తి - కడప

మోటార్ వాహనాల చట్టం 1988లోని సెక్షన్ 196 ప్రకారం బీమా లేని వాహనాలను నడిపితే శిక్షలు తప్పవని జిల్లా ఉప రవాణా కమిషనర్ మీరా ప్రసాద్ తెలిపారు. బీమా లేని వాహనాలను నడిపితే ఒకటవ నేరం కింద 3 నెలల వరకు జైలు శిక్ష, లేదా రూ. 2 వేల జరిమానా లేదా రెండు విధిస్తామని చెప్పారు. అలా నడిపితే తదుపరి నేరం కింద 3 నెలల వరకు జైలు శిక్ష లేదా, రూ. 4 వేల జరిమానా లేదా రెండు ఉంటాయని పేర్కొన్నారు. మీ వాహనాలకు థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్‌లు తప్పనిసరిగా కలిగి ఉండాలని, లేకపోతే పైన పేర్కొన్న విధంగా జరిమానాలు, శిక్షలు విధిస్తారని తెలిపారు.

మమ అనిపించారు!

పూర్తి స్థాయిలో హాజరుకాని సభ్యులు

సమస్యల పరిష్కారానికి కన్పించని చొరవ

ఇదీ జడ్‌పి స్థాయి సంఘాల సమావేశం తీరు!

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన స్థాయి సంఘాల సమావేశాలు మమ అనిపించేలా ముగిశాయి. పూర్తి స్థాయిలో స్టాండింగ్ కమిటీ సభ్యులు హాజరు కాకపోవడం, హాజరైన వారిలో కొందరు మాత్రమే సమస్యలు ప్రస్తావించడం గమనార్హం. జెడ్‌పి వైస్ చైర్మన్ బాలయ్య అధ్యక్షతన జిల్లా పరిషత్ స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలయ్య శాఖల వారీగా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా వ్యవసాయశాఖ మొదలుకుని రిజిస్ట్రేషన్లశాఖతో సమావేశం ముగించారు. ఉదయం 10 గంటల నుంచి 11.40 గంటల వరకు నడిచింది. ఈ లెక్కన 1.40 గంటలకు సమావేశం ముగియడం గమనార్హం. ఉదయం వ్యవసాయ శాఖ సమీక్ష సందర్భంగా హాజరైన వ్యవసాయ శాఖ అధికారులు వరి సబ్సిడీ విత్తనం సరఫరా గురించి పోరుమామిళ్ల జడ్‌పిటిసి ప్రస్తావించగా సమాధానం దాటవేత ధోరణిలో వ్యవహరించారు. పోరుమామిళ్ల మండలంలోని రంగసముద్రం పంచాయతీ పరిధిలోని ఏడు గ్రామాల్లో తాగునీటి సమస్య, పోరుమామిళ్ల ప్రధాన రహదారి పనుల నిర్లక్ష్యంపై నిలదీశారు. దీనికి పంచాయతీరాజ్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ స్పందించి రూ.25 కోట్లతో కాంట్రాక్టర్ పనులు చేపట్టారని, రూ.తొమ్మిది కోట్ల మేరకు బిల్లులు చెల్లింపుల్లో చోటుచేసుకున్న నిర్లక్ష్యం, 200 మీటర్ల మేర కోర్టు కేసుల వ్యవహారం ఉండడంతో పెండింగ్‌లో పడిందని వివరించారు. బిసి హాస్టల్ అద్దెల చెల్లింపు వ్యవహారం, సాంఘిక సంక్షేమ శాఖ నిర్వహించే హాస్టల్ ఏర్పాటుపై ప్రశ్నించారు. బిసి సంక్షేమశాఖ అధికారి బ్రహ్మయ్య స్పందించి ఆర్నెళ్ల కిందట బిసి హాస్టల్ అద్దెలన్నిటినీ చెల్లించేశామని వివరించారు. సాంఘిక సంక్షేమ శాఖ హాస్టల్ ఏర్పాటు అంశంపై ప్రభుత్వానికి రాశామని, ప్రభుత్వ ఆమోదం లభించిన వెంటనే హాస్టల్‌ను ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. పోరుమామిళ్ల జడ్‌పిటిసి మినహా మిగిలిన ప్రజాప్రతినిధులు ప్రశ్నలు అడగకపోవడం, జిల్లా అధికారులు శాఖల యొక్క ప్రోగ్రెస్‌ను చదివిన అనంతరం ప్రజాప్రతినిధుల సందేహాలకు సమాధానం చెప్పడం పరిపాటి. ఇటువంటి సంప్రదాయం కనిపించకపోవడం విస్మయం వ్యక్తమైంది.



సమావేశంలో మాట్లాడుతున్న జడ్‌పి వైస్ చైర్మన్ బాలయ్య

జడ్పీ చైర్మన్ 'ఆకేపాటి' రాజీనామా

- కలెక్టర్‌కు రాజీనామా లేఖ అందజేత

ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి రాజీనామా చేశారు. ఆయన శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ విజయ్‌రామరాజు కలిసి రాజీనామా లేఖను అందజేశారు. ఇటీవలి సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి తరుపున రాజంపేట ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో నిలిచి గెలిచిన సంగతి తెలిసి ందే. జిల్లా పరిషత్ చైర్మన్, ఎమ్మెల్యే పదవుల్లో ఏదైన ఒక పదవికి రాజీనామా చేయాల్సిన పరిస్థితుల్లో నేపథ్యంలో రాజీనామా చేశారు. 2021 సెప్టెంబర్ ఐదు వ తేదీ నుంచి నేటి వరకు సాగిన జిల్లా పరిషత్ చైర్మన్ ప్రస్థానం ముగిసింది. ఆయన స్థానంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ పి.బాలయ్య ఇన్ ఛార్జిగా బాధ్యతలు స్వీకరించారు. తాజా జిల్లా పరిషత్ స్టాండింగ్ కమిటీ సమావేశానికి జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ పి.బాలయ్య అధ్యక్షత వహించడం గమనార్హం.



కలెక్టర్‌కు రాజీనామా పత్రాన్ని అందజేస్తున్న ఆకేపాటి అమరనాథరెడ్డి

మోడీ విద్వేష పూరిత రాజకీయాలకు చెక్

-సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్

ప్రజాశక్తి- కడప అర్బన్

మోడీ బ్రాండ్ విద్వేష పూరిత రాజకీయాలకు దేశ ప్రజలు చెక్ పెట్టారని సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం ఆర్‌టిసి బస్టాండ్ సమీపంలో ఉన్న సిపిఎం జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన తర్వాత విపక్షాల ఇద్దరు సిపిఎంలను బిజెపి అరెస్టు చేయించినా రాహుల్‌గాంధీ ఎంపీ సభ్యత్వాన్ని రద్దు చేసినా, భావోద్వేగా ప్రసంగాలు చేసినా సిబిఐ, ఇడిలను అడ్డుపెట్టుకు విపక్ష పార్టీలను విచ్ఛన్నం చేసినా బిజెపి ప్రకటించిన 400 ఎంపీ సీట్లను సాధించ లేకపోయిందని చెప్పారు. కేవలం 240 సీట్లకు పరిమితమైందని తెలిపారు. రాజ్యాంగాన్నే మార్చేస్తాం, రిజర్వేషన్లు రద్దు చేస్తాం, మహిళలు, దళితులు, మైనార్టీలపై దాడులు చేస్తాం పేర్కొన్న బిజెపి ఎంపీలకు, కేంద్ర మంత్రులకు ఓటమి తప్ప లేదన్నారు.మోదీ ఏకచత్రాధిపత్యాన్ని జనం తిరస్కరించారన్నారు. 2019 ఎన్నికల్లో బిజెపికి 543 కుగానూ , 303 ఎంపీ సీట్లు రాగా 2024 ఎన్నికల్లో సిట్టింగ్ 63 ఎంపీ సిట్టింగ్ సీట్లలో ప్రజలు ఓడించారన్నారు. 3వసారి అధికారంలోకి వచ్చిన 'బిజెపికి సొంత బలం లేదన్నారు'. అయోధ్యలో ఓటమి, వారణాసిలో మెజార్టీ తగ్గడం, బిజెపిని ప్రజలు తిరస్కరిస్తున్నారన్నదానికి నిదర్శనం అన్నారు. దేశంలో పోలైన 64 కోట్ల ఓటర్లలో, 'దేశంలోని మెజార్టీ ఓటర్లు బిజెపిని తిరస్కరించారన్నారు. బిజెపి 10 సంవత్సరాల పరిపాలనలో క్రోనిక్యాప్టిస్టులకు జాతి సంపదను దోచుపెట్టారని వాపోయారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్‌తో సహజ వనరులన్నీ ఆదాని, అంబానీలకు కట్టబెట్టారని చెప్పారు. రూ.10 లక్షల కోట్లు బ్యాంకుల ద్వారా లబ్ధి పొందిన ప్రజల సొమ్మును ధనికులకు రద్దు చేశారని, ఎల్ఐసి., రైల్వే , రోడ్లు, విమానాశ్రయాలు, ఓడరే వులు ప్రయివేటుపరం చేశారని తెలిపారు. 18వ సార్వత్రిక ఎన్నికల్లో బిజెపి ఓడుతుందని, ప్రజలు గెలుస్తారని అంటే రూ.13 లక్షల కోట్ల విలువైన మధ్యతరగతి ప్రజల షేర్లు కోల్పోయేటట్లు బిజెపి అనుకూల పెట్టుబడిదారులు దేశ ప్రజకు నష్టపరి చారన్నారు. దీనిపై 'పార్లమెంట్ జాయింట్ యాక్షన్ కమిటీ' విచారించి ప్రజల షేర్లను నష్టపరిచిన కుంభకోణాన్ని వెలుగులోకి తీసి, బాధ్యులైన కంపెనీలను మూసివేయాలని డిమాండ్ చేశారు. వారి వల్ల నష్టపోయిన షేర్లు మొత్తాన్ని ప్రజలకు ఇప్పించాలని, బాధ్యులైన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఐ.ఎన్.సుబ్బమ్మ, బి.మనోహర్, ఎ.రామ్మోహన్, జిల్లా కమిటీ సభ్యులు కె.శ్రీనివాసుల రెడ్డి, వి.అన్వేష్, బి.దస్తగిరి రెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్

రాష్ట్రాన్ని జగన్, ఎమ్మెల్యేలు సర్వనాశనం చేశారు

అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములు, వక్ఫ్ ఆస్తులు వెలికి తీస్తాం

భూ కబ్జాదారులు, గంజాయి ముఠా, గూండాలు జిల్లా విడిచి వెళ్లాలి

టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు రెడ్డెప్పగారి శ్రీనివాసరెడ్డి



మాట్లాడుతున్న టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్రాన్ని, కడప జిల్లాను జగన్ ఉద్ధరిస్తారని 2019లో ప్రజలు అధికారం ఇస్తే, రాష్ట్రాన్ని, కడప జిల్లాను జగన్, ఆ పార్టీ ఎమ్మెల్యేలు సర్వనాశనం చేశారని టిడిపి రాష్ట్ర పోలిట్ బ్యూరో సభ్యులు, కడప జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి విమర్శించారు. శుక్రవారం ద్వారకా నగర్‌లోని ఆయన నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల పాలనలో ప్రజా సమస్యలు పరిష్కరించకపోగా వైసిపి పాలనలో ప్రభుత్వ భూములు, వక్ఫ్ బోర్డ్ ఆస్తులు అన్యాక్రాంతమయ్యాయని తెలిపారు. వాటిని వెలికి తీసి కబ్జా రాయుళ్ల తాట తీస్తామని హెచ్చరించారు. రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా అంజాద్‌బాషా అరాచకం చేశారే తప్ప, అభివృద్ధి గురించి ఏమాత్రం పట్టించుకోలేదని విమర్శించారు. రూ.2 వేల 3 వందల కోట్ల అభివృద్ధి నిధులకు జీవో చూపమని పదేపదే అడిగినా ఉలుకు పలుకు లేదన్నారు. భూ కబ్జాదారులు, గంజాయి మాఫియా, గూండాలు, రౌడీలు జిల్లా విడిచి వెళ్లాలన్నారు. ఇచ్చిన హామీలు జగన్ నెరవేర్చలేదని, నీటిపారుదల ప్రాజెక్టులపై నిర్లక్ష్యం చేశారని, నవరత్నాల పేరుతో ప్రజలను నవ మోసాలు చేశారని మండిపడ్డారు. అరాచకాలపై ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపుతారా అని నిలదీశారు. ప్రజాభిమానం కోల్పోయి జరిగిన ఎన్నికల్లో 11 స్థానాలు ఇచ్చి జగన్‌కు ప్రజలు పంగనామాలు పెట్టారన్నారు. పోలీస్ స్టేషన్‌లో ఎమ్మెల్యే తమ్ముడు దుర్భాషలాడారని, ఆయనకు ప్రజలు ఇలాగే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ప్రజలు సమస్యల పరిష్కారానికి నేరుగా తమను కలవచ్చని చెప్పారు. కడప ఎమ్మెల్యే రెడ్డప్ప గారి మాధవి మాట్లాడుతూ ప్రచారంలో భాగంగా ప్రతి ఇంటి గడప తాను తొక్కానని, ప్రతి వీధి సమస్య ప్రత్యక్షంగా చూసానని అన్నారు. కడప నగరాన్ని సమస్యలు లేని నగరంగా, సుందరంగా తీర్చి దిద్దుతానని తెలిపారు. రవీంద్ర నగర్ బుగ్గ వంక పై బ్రిడ్జిని త్వరలో నిర్మిస్తానని చెప్పారు. నగరంలో క్రైమ్ తగ్గించే విధంగా అన్నిచోట్ల సిసి కెమెరాలు ఏర్పాటు చేస్తామని, అవసరమైతే దాతల నుంచి సహాయం స్వీకరిస్తామని తెలిపారు. తనను ఎంతో ఆదరించి ఓట్లు వేసిన ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మెల్యే మాధవికి సన్మానం

కడప సిటీ : కడప ఎమ్మెల్యేగా ఎన్నికైన రెడ్డెప్ప గారి మాధవిని తొగట వీర క్షత్రియ సంక్షేమ సంఘం కడప నగర శాఖ నాయకులు కలిసి అభినందించి ఘనంగా సత్కరించారు. జిల్లా టిడిపి అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డిని కూడా ఘనంగా సత్కరించారు. వారి ఇరువురికి బొకేలు అందజేసి శాలువాలు కప్పి సత్కరించారు. భవిష్యత్తులో తొగట వీర క్షత్రియులకు అండగా ఉండి తమ సంక్షేమానికి పాటుపడాలని వారు ఈ సందర్భంగా వారికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో తొగట వీర క్షత్రియ సంక్షేమ సంఘం కడప నగర శాఖ గౌరవ అధ్యక్షులు సంగీనాథం ఆంజనేయులు, సి ఆర్ఐ పెద్ద సుబ్బరాయుడు, పల్లా బాల చౌడన్న, కడప నగర శాఖ కోశాధికారి టేకూరి సుదర్శన్ ,ఉపాధ్యక్షులు చౌడం సూర్యనారాయణ, బొలిశెట్టి వెంకటసుబ్బయ్య, బండి కృష్ణయ్య, ఉమ్మడిశెట్టి సురేంద్ర, కాల వెంకటరమణ, గుండ్లపల్లి ఆంజనేయులు, కాల్వ గంగాధర్, పెద్దకోట్ల వెంకటేశ్వర ప్రసాద్, పెద్దకోట్ల నిర్మలాదేవి వారిని కలిసి సత్కరించారు

మెగా డిఎస్‌సి హామీని నిలబెట్టుకోవాలి : డివైఎఫ్ఐ



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న డివైఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి- కడప అర్బన్

రాష్ట్రంలో నూతనంగా ఏర్పాటు కాబోతున్న ప్రభుత్వం కూటమి ఇచ్చిన హామీ మెగా డిఎస్‌సిపై మొదటి సంతకం హామీని అమలుపరచాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముడియం.చిన్ని, వీరనాల శివకుమార్ తెలిపారు. శుక్రవారం పాత బస్టాండ్ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో మొన్న జరిగిన సార్వత్రిక ఎన్నికలలో కూటమికి అధిక మెజారిటీతో రాష్ట్ర ప్రజలు గెలుపునిచ్చారని తెలిపారు. కూటమి మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు మెగా డిఎస్‌సిపై తొలి సంతకం చేయాలని పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయబోతున్న చంద్రబాబునాయుడు మెగా డిఎస్‌సిపై తొలి సంతకం పెట్టి రాష్ట్రంలోని నిరుద్యోగ యువతీ యువకుల కలను సాకారం చేయాలని కోరారు. గత ప్రభుత్వం గడిచిన ఐదు సంవత్సరాల కాలంలో ఒక్క డిఎస్‌సి కూడా నోటిఫికేషన్ ఇవ్వకుండా కాలయాపన చేసిందని పేర్కొన్నారు. నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీ అమలు చేయకుండా మోసం చేశారని తెలిపారు. ఫలితంగా రాష్ట్రంలోని లక్షలాది మంది నిరుద్యోగ యువతీ, యువకులు మొన్న జరిగిన ఎన్నికలలో ఓటు ద్వారా గత ప్రభుత్వాన్ని సాగనంపారన్నారు. రాష్ట్రంలో నూతనంగా ఏర్పడబోయే ప్రభుత్వమైనా నిరుద్యోగ యువతీ యువకుల పక్షాన నిలబడాలని కోరారు. సమావేశంలో నాయకులు అంజి పాల్గొన్నారు.

చేనేతల సంక్షేమానికి చొరవ చూపాలి

ప్రజాశక్తి - కడప

కదిరి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి టిడిపి ఎమ్మెల్యేగా ఘన విజయం సాధించిన కందికుంట వెంకట ప్రసాద్‌కు రాష్ట్రమంత్రి వర్గంలో స్థానం కల్పించాలని తొగట వీర క్షత్రియ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు బండారు సూర్యనారాయణ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, నగర అధ్యక్షులు కళ్యా సుధాకర్, జిల్లా కార్యదర్శి బందా శంకర్ తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడుకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. చేనేత ముద్దుబిడ్డగా, చేనేత కార్మికుల సాధకబాధకాలు, సమస్యలపై పూర్తి అవగాహన కలిగి ఉన్న కందికుంట వెంకటప్రసాద్‌కు రాష్ట్ర మంత్రివర్గంలో స్థానం కల్పించి చేనేత జౌళి శాఖను కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. కందికుంట వెంకటప్రసాద్ కు చేనేత జౌళి శాఖ కేటాయిస్తే రాష్ట్రంలోని 30 లక్షల మంది చేనేతల అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తారని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా వెంకటగిరి, చీరాల, మంగళగిరి, బాపట్ల, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, మదనపల్లి, శ్రీకాళహస్తి, ధర్మవరం తదితర నియోజకవర్గంలో ఉన్న చేనేత కార్మికులందరూ కొత్త ప్రభుత్వాన్ని స్వాగతించారన్నారు. మంగళగిరి నియోజకవర్గంలో చేనేత కార్మికులు ఒక లక్ష మందికి పైగా ఉన్నారని, అక్కడ మాజీ మంత్రి నారా లోకేష్ 90 వేల మెజారిటీతో విజయం సాధించారన్నారు. అ నందమూరి బాలకృష్ణ గెలిచిన హిందూపూర్ లో 30 వేల గొప్పగా చేనేత వర్గాలకు సంబంధించి ఓటర్లు ఉన్నారన్నారు. చేనేతలకు ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన వాగ్దానాలను అన్నింటిని నెరవేర్చాలని కోరారు. సమావేశంలో తొగట వీర క్షత్రియ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షులు చౌడం సూర్యనారాయణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ పల్లా మురళీకృష్ణ, గౌరవాధ్యక్షులు పల్లా బాల చౌడన్న, ఉపాధ్యక్షులు బొలిశెట్టి వెంకట స్వామి, సానా లక్ష్మీనారాయణ, బండి కృష్ణయ్య, కూరకూటి వెంకట సుబ్బయ్య, నగరశాఖ కోశాధికారి టేకూరి సుదర్శన్, సంఘం నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సంఘం జిల్లా అధ్యక్షులు బండారు సూర్యనారాయణ

పశు సంపదను పెంచాలి

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు

గ్రామీణ ప్రాంతాలలో పశు సంవదను పెంచాలని పశువైద్య కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్‌శ్రీనివాసప్రసాద్ తెలిపారు. స్థానిక పశువైద్యకళాశాలలో శుక్రవారం పశు ఉత్పత్తుల సాంకేతిక విభాగంలో ఐసిఎఆర్ ఎస్సీ-సబ్‌ప్లాన్ సహకారంతో గ్రామీణ ఎస్‌సి మహిళలకు విలువ చేకూరిత మాంస, గుడ్డు పదార్థాల తయారీ విధానంపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం హాజరైన మహిళలకు బహుమతులు అందజేశారు. కార్యక్ర మంలో పశు ఉత్పత్తుల సాంకేతిక విభగ అధిపతి డాక్టర్ నాగమల్లిక, అధ్యాపక సిబ్బంది సాయిదిలీప్‌గుప్త, రాజాతిమ్మారెడ్డి, వివేకానందరెడ్డి, సహాయక సిబ్బంది పుల్లారెడ్డి, రమణ పాల్గొన్నారు.

మరెన్నో విజయాలు సాధించాలి

ప్రజాశక్తి - దువ్వూరు

మక్తుమ్‌సాబ్ భవిష్యత్‌లో మరెన్నో విజయాలు సాధదించాలని కస్పాండెంట్ తిరుపాల్‌రెడ్డి, ప్రిన్సిపల్ దుర్గన్న పేర్కొన్నారు. స్థానిక పుల్లారెడ్డిపేటలోని శ్రీశ్రీనివాస జూనియర్ కళాశాల పూర్వపు విద్యార్థి గోల్డ్ మెడల్ సాధించడంలో వారు అభినందనలు తెలిపారు. శుక్రవారం విద్యార్థిను వారు సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మే 24 నుండి 26 తేదీ వరకు నిర్వహించిన ఎస్‌బికెఎఫ్ నేషనల్ గేమ్స్ పోటీలలో ఖోఖో, 1500 మీటర్ల రన్నింగ్ రెండు విభాగాలలో గోల్డ్ మెడల్ సాధించినట్లు తెలిపారు. తమ కళాశాలలో చదివి జాతీయ స్థాయిలో గోల్డ్ మెడల్ సాధించడం గర్వకారణమన్నారు.

నగరంలో జోరు వాన

రోడ్లపై నిలిచిన వర్షపు నీరు - పొంగిపొర్లిన డ్రెయినేజీ

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలో మధ్యాహ్నం జోరు వాన కురిసింది. భోజన విరామ సమయం కావడంతో ప్రభుత్వ కార్యాలయాలు, ప్రయివేట్ సంస్థల్లో పని చేసే ఉద్యోగులు, సామాన్య ప్రజలు వర్షం దెబ్బకు ఎక్కడికక్కడ నిలిచిపోయారు. జోరు వర్షం కారణంగా రోడ్లపై మోకాలి లోతుకు నీళ్లు నిలిచాయి. డ్రైనేజీ కాలువలు పొంగిపర్లాయి. దీంతో ద్విచక్ర వాహన చోదకలు, పాదచారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. షరా మామూలే అన్నట్లు ఆర్‌టిసి బస్టాండ్ సమీపంలో వర్షపు, డ్రెయినేజీ నీళ్లు పెద్దఎత్తున నిలిచాయి. దీంతో వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. టిడిపి ఎమ్మెల్యే మాధవి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఇక్కడ నీరు నిలవకుండా పనులు చేస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేగా గెలుపొందిన ఆమె సమస్యను పరిష్కరిస్తారనే ఆశతో ప్రజలు ఎదురుచూస్తున్నారు.



రోడ్డుపై నిలిచిన వర్షపునీరు



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసులు

కూటమి విజయం చారిత్రాత్మకం

- ఎన్‌జిఒ నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో తెలుగుదేశం, జనసేన, బిజెపి కూటమి విజయం చారిత్రాత్మకం అని ఎపి ఎన్‌జిఒ జిల్లా అధ్యక్షులు బి. శ్రీనివాసులు రాష్ట్ర సహ అధ్యక్షులు వి.దస్తగిరి రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు వై. ప్రసాద్ యాదవ్ అన్నారు. శుక్రవారం ఎన్‌జిఒ హోమ్‌లో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు బి. శ్రీనివాసులు మాట్లాడుతూ కాబోయే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకుకృతజ్ఞతలు తెలిపారు. నూతన ప్రభుత్వానికి ఉద్యోగులు పూర్తి సహాయ సహకారం అందించి ప్రభుత్వానికి మంచి పేరు వచ్చేలా కృషిచేస్తామన్నారు. రాష్ట్ర అధ్యక్షులు కె.వి. శివారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి.ఎచ్. పురుషోత్తం నాయుడు ఆధ్వర్యంలో రాష్ట్ర ఎన్‌జిఒ నాయకులు ప్రభుత్వ పథకాలను విజయవంతం చేస్తారని పేర్కొన్నారు. ఉద్యోగులకు ప్రతి నెలా 1వ తేదీన జీతాలు, సిపిఎస్ రద్దు, అరియర్స్, సరెండర్ లీవ్స్, 12వ పిఆర్‌సి అమలు వంటి వాటిని నూతన ప్రభుత్వం ఇస్తుందని ఆశిస్తున్నామని చెప్పారు. సమావేశంలో జిల్లా నాయకులు టి. తిమ్మారెడ్డి, నిత్య పూజాయ్య, టి.శ్రీనివాసులు, బ్రాహ్మందరెడ్డి, రాజశేఖర్, బాలపుల్లయ్య, పోలిరెడ్డి, సిటి నాయకులు సైలెశ్వేర్ రెడ్డి, నాగార్జున, పద్మనాబం, నాలుగవ తరగతి సంఘం జిల్లా అధ్యక్షులు కాటమయ్య, ఎన్‌జిఒ నాయకులు పాల్గొన్నారు.

'హమారే బారా' ప్రదర్శనపై కలెక్టర్‌కు ఫిర్యాదు

ప్రజాశక్తి - కడప

ఇస్లామ్‌కు, పవిత్రమైన ఖురాన్‌కు వ్యతిరేకంగా నిర్మించిన 'హందో - హమారే బారా' అనే హిందీ సినిమాను వెంటనే ప్రదర్శించకుండా నిషేధించాలని వివిధ రాజకీయ పార్టీల నేతలు, ప్రజాసంఘాల నాయకులు శుక్రవారం కలెక్టర్ విజయ్ రామరాజుకు, జిల్లా అదనపు ఎస్‌పికి శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇస్లాం సంప్రదాయం, సంస్కృతి ముస్లిములు, ముస్లిం మహిళల నిబద్ధత, వారి వ్యక్తిగత జీవితాలను వక్రీకరిస్తూ అన్ను కపూర్ అనే దర్శక నిర్మాత సదరు హిందీ సినిమాను నిర్మించి నిర్మించారని పేర్కొన్నారు ముస్లిముల మనోభావాలను తీవ్రంగా గాయపరిచినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. పవిత్ర ఖురాన్‌లోని సూర బకరాను వక్రీకరిస్తూ ట్రైలర్ విడుదల చేశారని ఆరోపించారు. శుక్రవారం రోజున సినిమా విడుదల కానున్న దృష్ట్యా కడప జిల్లాలో ఈ చిత్ర ప్రదర్శన నిలిపివేయాలని కోరారు. సదరు చిత్ర నిర్మాత, దర్శకులు నటీనటు లపై కూడా చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు. లేని పక్షంలో ప్రజాస్వామ్య యుతంగా సదరు సినిమాను నిషేధించే వరకు ఆందోళనలు చేపడతామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మైనార్టీ విభాగ ఉపాధ్యక్షుడు అలీ ఖాన్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అమీర్ బాబు, ప్రముఖ సంఘ సేవకుడు సలావుద్దీన్, జెఎసి జిల్లా కన్వీనర్ బాబుభాయ్, మత గురువు అబ్దుల్ రెహమాన్, ఏ మైనార్టీ ఫోరం రైట్స్ నేత దస్తగిరి పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఆయా పార్టీల నాయకులు



తులసిరెడ్డిని సన్మానిస్తున్న జిల్లా అధ్యక్షులు గుండ్లకుంట శ్రీరాములు

టిడిపి పాలనలోనైనా

ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలి

- పిసిసి మీడియా ఛైర్మన్ తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

ఎపిలో ఏర్పాటు చేయనున్న నూతన టిడిపి పాలనలోనైనా కడప స్టీల్ ప్లాంట్‌ను నిర్మించాలని పిసిసి మీడియా ఛైర్మన్ తులసిరెడ్డి అన్నారు. శుక్రవారం వేంపల్లెలో ఉన్న ఆయన్ను కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గుండ్లకుంట శ్రీరాములు మర్యాద పూర్వకంగా కలిసి ఇటీవల జరిగిన ఎన్నికల ఫలితాలపై, భవిష్యత్తు ప్రణాళికపై చర్చించారు. అనంతరం తులసిరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్లు కడప జిల్లాలో నిరుద్యోగ యువత పరిస్థితి ఉందని చెప్పారు. రాష్ట్ర విభజన చట్టం ప్రకారం కడప జిల్లాలో సెయిల్ ఆధ్వర్యంలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు కావాలన్నారు. స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు కావాల్సిన అన్ని హంగులు జిల్లాలో ఉన్నాయని తెలిపారు. స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి కావాల్సిన భూమి ఉందని తెలిపారు. నీటి సరఫరాకు సంబంధించి గండికోట, మైలవరం, బ్రహ్మ సాగర్, సోమశిల రిజర్వాయర్లు ఉన్నట్లు చెప్పారు. విద్యుత్ సరఫరాకు చెందిన ముద్దనూర్ థర్మల్ పవర్ ప్లాంట్ ఉందని చెప్పారు. కానీ మోడీ ప్రభుత్వానికి చిత్త శుద్ధి లేదన్నారు..2014 నుండి 2019 వరకు చంద్ర బాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పటికీ కేంద్రంలో బిజెపికి సొంతంగా పూర్తి మెజారిటీ ఉన్నందున చంద్రబాబు ప్రయత్నం ఫలించలేదని తెలిపారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదని చెప్పారు. బిజెపికి కేంద్రంలో సొంతంగా పూర్తి మెజారిటీ లేక పోవడంతో టిడిపిపై ఆధారపడిందని చెప్పారు. కాబట్టి ఇప్పుడైనా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి కడప జిల్లాలో సెయిల్ ఆధ్వర్యంలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని కోరారు.



కెసి కాలువలో ప్రవహిస్తున్న వర్షపు నీరు

చిగురిస్తున్న కెసి, కుందూ రైతుల ఆశలు

ప్రజాశక్తి - చాపాడు

గత ఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితులతో కెసి కాలువకు పూర్తి స్థాయిలో నీరు విడుదల చేయలేదు. కెసి పరిధిలో ఆరుతడి పంటలకే పరిమితం కావాల్సి వచ్చింది. ప్రస్తుతం మే నెల చివరి నుంచి రుతుపవనాలు పలకరిస్తుండటంతో వర్షాలు పడుతున్నాయి. వర్షాలు క్రమంగా పెరుగుతూ వస్తూ ఉండటంతో కెసి రైతుల ఆశలు చిగురిస్తున్నాయి. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు రాజోలి ఆనకట్ట వద్ద నీటి మట్టం పెరిగి కుందూ నదిలోకి 7వేల క్యూసెక్కుల నీరు విడుదలైంది. కుందూ పరిధిలోని రైతులు పంటల సాగుకు సమాయత్తమవుతున్నారు. వరి వంగడాలను సేకరించే పనిలో నిమగ్నమౌతున్నారు. గత ఏడాది ఎగువ ప్రాంతాల్లో తక్కువ వర్షపాతం నమోదు కావడంతో ఆరుతడి పంటలు మాత్రమే సాగు చేయాలని ఉన్నతాధికారులు సూచించారు. కుందూ, పెన్నా పరిధిలో ఇప్పటికే రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమై విత్తనాలు, ఎరువులు సేకరించే పనిలో పడ్డారు. సకాలంలో నీరు విడుదల అయితే కెసి, కుందూ పరిధిలో మండల వ్యాప్తంగా 16వేల ఎకరాలలో వరి పైరు సాగు అయ్యే అవకాశం ఉంటుంది.



ర్యాలీ నిర్వహిస్తున్న సిడిపిఒ, ఐసిడిఎస్ సిబ్బంది

లింగ వివక్ష చూపవద్దు

ప్రజాశక్తి - మైదుకూరు

సమాజంలో స్త్రీ పురుషులు ఇద్దరూ సమానమే అని, లింగ వివక్ష చూపరాదని ఐసిడిఎస్ అధికారులు అన్నారు. లింగ వివక్ష నిర్మూలనపై అవగాహన కార్యక్రమంలో భాగంగా వారం రోజుల నుంచి మైదుకూరు స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు ఆధ్వర్యంలో జీవి సత్రం, వనిపెంట సెక్టార్ పరిధిలోని పలు అంగన్వాడీ కేంద్రాలలో ఐసిడిఎస్ సిడిపిఒ శ్రీదేవి ఆధ్వర్యంలో లింగ వివక్ష నిర్మూలనపై అవగాహన కల్పించారు. అలాగే లింగ నిర్ధారణ చట్టంపై అవగాహన కల్పించారు. మైదుకూరు సెక్టార్ పరిధిలోని మైదుకూరు 6వ అంగన్వాడీ కేంద్రం, వనిపెంట పెక్టార్ పరిధిలోని విశ్వనాధపురం, ఎస్సీ కాలనీ అంగన్వాడి కేంద్రంలో, జీవి సత్రం సెక్టర్ పరిధిలోని తువ్వపల్లె అంగన్వాడి కేంద్రంలలో లింగ వివక్ష నిర్మూలన, లింగ నిర్ధారణ చట్టరీత్య నేరం అనే అంశాలపై అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ ప్రశాంతి, హెల్త్ సూపర్‌వైజర్లు, ఎఎన్‌ఎంలు, అంగన్వాడీ వర్కర్లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

మాధవి గెలుపు అభినందనీయం

ప్రజాశక్తి - వేంపల్లె

కడప ఎమ్మెల్యేగా మాధవి గెలుపొందడం అభినందనీయమని బ్రహ్మణ సంఘం జిల్లా అధ్యక్షులు ప్రసాద్ రావు అన్నారు. శుక్రవారం కడపలో ఉన్న ఎమ్మెల్యే మాధవినికలిసి అభినందనలు తెలిపారు. బ్రహ్మణ కార్పొరేషన్ ద్వారా నిరు పేద బ్రహ్మణులకు ఆదుకొనేందుకు సిఎంగా బాధ్యతలు చేపట్టే చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. 2014లో టిడిపిఅధికారంలోకి వచ్చినప్పుడు నిరుపేద బ్రహ్మణులను కార్పొరేషన్ ద్వారా ఆదుకున్నారన్నారు. ఇటివల జరిగిన ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు బ్రహ్మణులు అందరూ సహకరించారని తెలిపారు. వైసిపి ఐదేళ్ల పాలనలో బ్రహ్మణులకు ఎలాంటి సంక్షేమ పథకాలు మంజూరు చేయక పోవడంతో పాటు బ్రహ్మణ కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేసినట్లు చెప్పారు. బ్రహ్మణ కార్పొరేషన్‌ను పునరుద్ధరణ చేసి వాటి ద్వారా పథకాలు మంజూరు చేయడంతో పాటు ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు.



కడప ఎమ్మెల్యే మాధవికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ప్రసాదరావు

చినుకు పడితే చిత్తడే చిత్తడి

ప్రధాన రహదారిలో నిలిచిన వర్షపు నీరు



మైదుకూరు : రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

ప్రజాశక్తి -మైదుకూరు

మైదుకూరు మున్సిపాల్టీ చినుకు పడితే చిత్తడే చిత్తడిగా తయారైంది. గురువారం మధ్యాహ్నం కురిసిన ఓ మోస్తారు వర్షానికి మైదుకూరు పట్టణంలోని పోరుమామిళ్ల రోడ్డులో నీరు నిలబడింది. దీంతో ప్రయాణికులకు ఇబ్బందులు పడ్డారు. మైదుకూరు నుంచి పోరుమామిళ్ల, విజయవాడ ప్రధాన రహదారి కావడంతో రహదారి గుండా వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. స్థానిక మార్కెట్ వద్ద రోడ్డుపై నీరు నిలిచి ఉండడంతో ద్విచక్ర వాహనాల ప్రయాణికులతో పాటు పాదచారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు పోయేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

భారీ వర్షం.. రోడ్లు జలమయం

పులివెందుల టౌన్ : పట్టణంలో కురిసిన భారీ వర్షానికి రోడ్లు జలమయమయ్యాయి. శుక్రవారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి రోడ్డుపై మోకాలి లోతులో నీళ్ళు ప్రవహించాయి. దీంతో రోడ్లపై వెళ్లే ప్రజలు, వాహనదారులు ఎంతగానో ఇబ్బంది పడ్డారు. డ్రెయినేజీలో ప్రవాహం సరిగా లేకపోడంతో నీళ్లన్నీ రోడ్డుపై నిలబడ్డాయి. తోపుడు బండ్లపై పండ్లు విక్రయదారులు, పూల వ్యాపారులు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. మరో రెండురోజులు ఇలాగే వర్షాలు కురిస్తే పట్టణ పరిస్థితి ఎంటని పలువురు పేర్కొన్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు చొరవ తీసుకొని డ్రెయినేజీలలోను, మురుగు కాలువలలోనూ పేరుకుపోయిన చెత్తను తీసి నీళ్ల రోడ్లపైకి రాకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



పులివెందుల టౌన్ : వర్షానికి రోడ్డుపై ప్రవహిస్తున్న నీరు

నీట మునిగిన పంట పొలాలు

సింహాద్రిపురం : మండలంలో మూడు రోజుల నుంచి వర్షాలు కుడుస్తుండడంతో పంట పొలాలు నీట మునగాయి. గురువారం రాత్రి కురిసిన వర్షానికి మండలంలోని బలపనూరు, నక్కల పల్లె, సింహాద్రిపురం, గురజాల తదితర గ్రామాలలో చెక్ డ్యాం, వంకలు, నీటి కుంటలు నీటితో కళకళలాడుతున్నాయి. రెండు నెలల నుంచి తీవ్ర వర్షా బావకారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చీనీ చెట్లకు నీటితడులు అందించలేక రైతులు అనేక అగచాట్లు పడ్డారు. వర్షం పడడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు భానుడు భగభగ నుంచి కాస్త ఉపశమనం లభించిందని ప్రజలు చెబుతున్నారు.



సింహాద్రిపురం : నక్కలపల్లి సమీపంలో నీట మునిగిన చీనీ చెట్లు

ముగిసిన వేసవి శిబిరాలు

ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం



మాట్లాడుతున్న ఎంఇఒ సావిత్రమ్మ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ప్రొద్దుటూరు పట్టణం ప్రథమ శ్రేణి పుట్టపర్తి నారాయణాచార్యుల శాఖా గ్రంథాలయం, రామేశ్వరం బాలబాలికల గ్రంథాలయం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సమ్మర్ క్యాంప్ ముగినొసది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి ఎంఇఒ సావిత్రమ్మ, రాయలసీమ యునివర్సిటీ లైబ్రేరియన్ ఏం.గంగాధర్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. సమ్మర్ క్యాంప్ సమావేశంలో విద్యార్థులతో వారు మాట్లాడుతూ చదువుతున్న స్కూల్ లైబ్రరీలను సద్వినియోగం చేసుకోవాలని, ప్రతి సంవత్సరమూ గ్రంథాలయాల్లో నిర్వహించే సమ్మర్ క్యాంపు లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రంథాలయాల్లోని మంచి కథలు, జనరల్ నాలెడ్జ్ పద్యాలు వంటి పుస్తకాలు చదివి విజ్ఞానవంతులు కావాలన్నారు. అనంతరం సమ్మర్ క్యాంప్‌లో వివిధ పోటీలలో పాల్గొని విజేతలైన విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి తిరుపతమ్మ రామేశ్వరం, గ్రంథాలయ రికార్డ్ అసిస్టెంట్ ఇబ్రంసాహెబ్, అధ్యాపకులు చాడా ముని శేఖర్‌రెడ్డి, పవన్ కళ్యాణ్, ఆర్‌టిపిపి డిఇఇ ఆర్ ప్రభాకర్ రెడ్డి, రీసోర్స్ పర్సన్లు వెంకట కొండయ్య, నిర్మల జ్యోతి, గ్రంథాలయ హెల్పర్ నాగలక్ష్మి, విద్యార్థిని విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు. **చక్రాయపేట :** నేటి విద్యార్థులే రేపటి పౌరులని చక్రాయపేట గ్రంథాలయ అధికారి ఏ రాజశేఖర్ పేర్కొన్నారు. స్థానిక శాఖాగ్రంథాలయంలో శుక్రవారం వేసవి శిక్షణ శిబిరాలు (సమ్మర్ క్యాంపు)ముగింపు సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి గ్రంథాలయ అధికారి, నాగులగుట్టపల్లి, తిమ్మారెడ్డిగారిపల్లి, బిడిసి నిర్వాహకులు ప్రసాద్ రెడ్డి, రామచంద్రారెడ్డి హాజరై మాట్లాడారు. అనంతరం విద్యార్థులకు నీతీ కథలు, నీతీ పద్యాలు, దేశ నాయకుల జీవిత చరిత్రలు చదివించడం, స్పోకెన్ ఇంగ్లీష్‌పై అవగాహన, చిత్రలేఖనం, జనరల్ నాలెడ్జి వ్యాసరచన, మ్యూజికల్ చైర్స్ , లెమన్ స్పూన్ పోటీలలోని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

కార్యక్రమంలో స్థానిక పాఠశాలల విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు. సమ్మర్ క్యాంపు నిర్వహణకు సహకరించిన అందరికి గ్రంథాలయ అధికారి కృతజ్ఞతలు తెలిపారు. **వేంపల్లె :** ప్రతి విద్యార్థి పోటిల్లో ప్రతిభ చాటినప్పుడే గుర్తింపు వస్తుందని, పోటి పరీక్షలకు హాజరు కావాలని పంచాయతీ కార్యదర్శి సుబ్బారెడ్డి అన్నారు. శుక్రవారం సమ్మర్ క్యాంపు ముగింపు సందర్భంగా స్థానిక గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన వ్యాస రచన పోటిల్లో గెలుపు పోందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ శాఖ అధికారి వనజా కుమారి, రిటైర్డ్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. **అట్లూరు :** స్థానిక శాఖా గ్రంథాలయంలో శుక్రవారం వేసవి శిక్షణ శిబిరాలు ముగింపు కార్యక్రమం గ్రంథాలయ అధికారి సుధాకర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల అభివృద్ధి అధికారి ఎస్. అమానుల్లా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మండల ఎఇ భాస్కర్ బాబు, పంచాయతీ కార్యదర్శి సుబ్బరాయుడు, సిఅర్‌పి రమణారెడ్డి పాల్గొన్నారు. **ఎర్రగుంట్ల :** స్థానిక శాఖా గ్రంథాలయలో 20 రోజులుగా నిర్వహిస్తున్న వేసవి వినోద కార్యక్రమాల ముగింపు వేడుకలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి ఉమాదేవి మాట్లాడుతూ వేసవి వినోద కార్యక్రమాలు పిల్లల మనోవికాసానికి, ఆలోచన శక్తిని పెంపొందించేందుకు ఉపయోగపడతాయనారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి బాలబయన్న మాట్లాడుతూ ఈ సమ్మర్ క్యాంపు నందు పిల్లలకు వినోదాత్మకమైన విజ్ఞానం కలిగించే కార్యక్రమాలు నిర్వహించారని చెప్పారు. అనంతరం వివిధ అంశాలల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జెవివి నాయకులు కె.వి. సుబ్బయ్య, ఎం.రాంప్రసాద్ రెడ్డి, బహుమతులు పొందిన శశికళ, కిరణ్మయి,రోహిత్, హాసిని, వెంకట ధావని, నవ్య, రతిక, హర్ష పాల్గొన్నారు.



చక్రాయపేట : విద్యార్థికి బహుమతి అందజేస్తున్న గ్రంథాలయాధికారి

'చెన్నుపల్లి'ని సన్మానించిన తెలుగు యువత అధ్యక్షులు

ప్రజాశక్తి-బ్రహ్మంగారిమఠం

టిడిపి మండల అధ్యక్షులు చెన్నుపల్లి సుబ్బారెడ్డిని తెలుగు యువత అధ్యక్షులు శుక్రవారం సన్మానించారు. పుట్టా సుధాకర్ యాదవ్ మైదుకూరు ఎమ్మెల్యేగా భారీ మెజారిటీతో గెలుపొందడంలో బ్రహ్మంగారిమఠం మండలంలో ఆయన కీలకంగా వ్యవహరించి తెలుగుదేశం పార్టీకి ఎప్పుడూ రానంత మెజారిటీ తెప్పించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, సన్నపురి శ్రీను పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పాలన సాగించాలి : కాంగ్రెస్

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు

విభజన, జగన్ పాలన అనంతరం రాష్ట్రం ఆర్థికంగా బాగా నష్టపోయిందని ఇలాంటి దుస్థితిలో ఉన్న ఆంధ్రరాష్ట్రాన్ని చరిత్రాత్మకమైన విజయంతో గెలిచిన కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పాలన సాగించాలని కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి నజీర్ కోరారు. స్థానిక పార్టీ కార్యాలయంలోశుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాతీర్పు హర్షణీయమన్నారు. కాంగ్రెస్‌పార్టీకి ఓటు శాతం పెంచి డబ్బులేమి ఆశించకుండా ఆదరించిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. ఎంపీ అభ్యర్థి షర్మిలకు, ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు ఓటేసిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. గెలిచిన చంద్రబాబునాయుడికి, పవన్‌కళ్యాణ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. విభజన హామీలను నెరవేర్చాలన్నారు. తన గురువు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. మంచి పనులు చేసి శాశ్వతంగా ప్రజల గుండెల్లో నిలిచిపోవాలని ఆశించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జీలాన్‌బాష, సుజీర్ పాల్గొన్నారు.

10లోపు దరఖాస్తు చేసుకోండి

ప్రజాశక్తి-కాశినాయన

మండల కేంద్రమైన నరసాపురంలోని ఎపి మోడల్ పాఠశాలలో ఖాళీగా ఉన్న 7,8, 9 తరగతుల సంబంధించి ఎన్ని ఖాళీలు ఉన్నా వాటిని దరఖా స్తు చేసుకునేందుకు ఈనెల 10 వరకు చివరి అవకాశం కలదని, ఆ పాఠశాల ప్రిన్సిపల్ సౌజన్య తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దరఖాస్తు విద్యార్థి చదువుతున్న స్టడీ సర్టిఫికెట్‌తో పాటు విద్యార్థి తల్లిదండ్రుల ఆధార్ కార్డు జిరాక్స్, విద్యార్థి రెండు ఫోటోలు పాఠశాలలో ఇవ్వాలన్నారు. అనంతరం వారం దరికే రాత పరీక్ష నిర్వహించి ఎవరి అర్హత బట్టి వారికి సీటు కేటాయిస్తామని అన్నారు. ఏడవ తరగతికి స్టేట్ సిలబస్ 8, 9వ తరగతి వరకు సెంట్రల్ సిలబస్ ఉంటుందని చెప్పారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఎల్లప్పుడూ ప్రజాజీవితంలోనే కొనసాగుతా : 'రాచమల్లు'

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు

ప్రజాజీవితంలో గెలిచినా ఓడినా ఎల్లప్పుడూ ప్రజలతోనే కొనసాగుతానని మాజీ ఎంఎల్‌ఏ రాచమల్లు ప్రసాదరెడ్డి స్పష్టం చేశారు. స్థానిక వైసిపి కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని ప్రజలిచ్చిన తీర్పును అంగీకరిస్తూ ఓటమిని అంగీకరిస్తున్నానన్నారు. పదేళ్లలో ఒక పర్యాయం ప్రతిపక్ష ఎంఎల్‌గా, ఒక పర్యాయం అధికారపక్ష ఎమ్మెల్యేగా నిబద్ధతతో విధులు నిర్వహించానని అన్నారు. ఊరిని ప్రశాంతంగా ఉంచుతూ అభివృద్ధివైపు నడిపించానన్నారు. ఉద్యోగుల విషయంలో గౌరవంగా వ్యవహరించానన్నారు. వ్యాపారులు భద్రతకోసం పనిచేశానన్నారు. 28 సంవత్సరాలుగా పేదల పట్ల సహకారంగా ఉన్నానన్నారు. ఇంతవరకూ సహకరించిన ప్రజలకు ఏమిచ్చినా రుణం తీర్చుకోలేనిదన్నారు. చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీల విషయంలో భ్రమించి బ్రహ్మరథం పట్టారన్నారు. ఆ నమ్మకం నిలుస్తుందా వమ్ము అవుతుందా అన్నది కాలమే నిర్ణయిస్తుందన్నారు. ఆ హామీలు అమలవ్వాలని కోరుకుంటున్నానన్నారు. ఆ హామీలు అమలయ్యేందుకు ఒక సంవత్సరం కాలమిస్తున్నానని, అనంతరం ప్రజాప్రయోజనార్ధం ప్రశ్నిస్తానని చెప్పారు. ప్రొద్దుటూరు నియోజకవర్గంలో మెడికల్‌కళాశాల, పాలకర్మాగారం, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ సిస్టమ్, సంక్షేమం పట్ల ప్రజల పక్షాన గొంతు విప్పుతానన్నారు. గెలిచిన వరదరాజులరెడ్డికి మనస్ఫూర్తిగా శుభాకాంక్షలు తెలుపుతున్నానని, తన వెంట నడిచిన వైసిపి నాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.



మీడియాతో మాట్లాడుతున్న రాచమల్లు ప్రసాదరెడ్డి



కేక్ కట్ చేస్తున్న నల్లంశెట్టి నాగార్జున

కూటమి గెలుపుతో మా బాధ్యత పెరిగింది

- జమ్మలమడుగు జనసేన కో-ఆర్డినేటర్ నల్లంశెట్టి నాగార్జున

ప్రజాశక్తి -జమ్మలమడుగు రూరల్

రాష్ట్రంలో కూటమితో పాటు పవన్ కళ్యాణ్, జమ్మలమడుగులో ఆదినారాయణ రెడ్డి గెలుపుతో జనసేన కార్యకర్తలు, నాయకుల బాధ్యత మరింత పెరిగిందని జమ్మలమడుగు జనసేన కో-ఆర్డినేటర్ నల్లంశెట్టి నాగార్జున తెలిపారు. శుక్రవారం స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో జనసేన వందశాతం సీట్లు, జమ్మలమడుగులో ఆదినారాయణ రెడ్డి గెలిచినందుకు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా నల్లంశెట్టి నాగార్జున మాట్లాడుతూ జనసేన 21 అసెంబ్లీ, రెండు ఎంపీ స్థానాలను కైవసం చేసుకున్న ఏకైక పార్టీ జనసేన అన్నారు. జనసేన అధ్యక్షులు పిఠాపురంలో గెలవడానికి కృషిచేసిన టిడిపి ఇన్‌ఛార్జి వర్మకి, అక్కడ జనసేన కార్యకర్తలకు నాయకులకు, రాష్ట్రవ్యాప్తంగా కూటమిని బలపరిచిన ప్రతి జన సైనికునికి హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నామన్నారు. ఇ ఆదినారాయణ రెడ్డి గెలుపునకు మారుపేరుగా నిలిచారన్నారు. ఇప్పటివరకు నాలుగు సార్లు పోటీ చేస్తే నాలుగు సార్లు ఓటమి ఎరుగని నేతగా చరిత్ర మారారని చెప్పారు. జమ్మలమడుగు అభివృద్ధికి ఆయనతో కలిసి జనసేన నాయకులం పని చేస్తామని అన్నారు. భవిష్యత్తులో ఇక్కడ ఆదినారాయణ రెడ్డి తమకు ఏ బాధ్యత ఇచ్చిన కర్తవ్యంతో నిర్వహిస్తామని తెలిపారు. ఎమ్మెల్యేగా గెలిచిన ఆదినారాయణ రెడ్డికి, గెలిపించిన జన సైనికులకు, టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డికి టిడిపి నాయకులకు మరొకసారి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం కమిటీ సభ్యులు పవన్ కుమార్, సీనియర్ నేత వనం కుమార్, వినయ్, ఉదయ్, టి. హరనాథ్ రెడ్డి, పుల్లయ్య, మహబూబ్ కాటమరాయుడు, వీర మహిళ జి. పుష్పలత, సుధాకర్, వలి, గూడెంచెర్వు సుబ్బయ్య, జె. మహబూబ్ బాషా పాల్గొన్నారు.



మనోహర్‌ను సన్మానిస్తున్న జగదీష్

నాదెండ్ల మనోహర్‌తో జగదీష్ భేటీ

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

జనసేన పార్టీ రాష్ట్ర పిఎసి చైర్మన్, తెనాలి నియోజకవర్గ శాసనసభ్యులు నాదెండ్ల మనోహర్‌తో శుక్రవారం ఎర్రగుంట్ల మండల జనసేన కో-ఆర్డినేటర్ దేరంగుల జగదీష్ భేటీ అయ్యారు.తెనాలిలోని జనసేన పార్టీ కార్యాలయంలో నాదెండ్ల మనోహర్‌ను కలిసి శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జగదీష్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, ఎల్లప్పుడూ ప్రజల మధ్య ఉంటూ ప్రజల సమస్యలు తీర్చేలా పనిచేయాలని సూచించినట్లు తెలిపారు. నాదెండ్ల మనోహర్‌ను కలిసిన వారిలో నాగరాజు, శివ ఉన్నారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి- చక్రాయ పేట

రాయలసీమలో పేరు ప్రఖ్యాతి చెందిన గండి క్షేత్రంలో ఆంజనేయ స్వామి దర్శనం కోసం వచ్చే భక్తాదులకు శాశ్వత నిత్యాన్నదాన పథకానికి రాజంపేట మండలం పెద్దూరు ఆకేపాడు వాస్తవ్యులు టంగుటూరు నరసారెడ్డి కుటుంబ సభ్యులు రూ.1,00,116 విరాళం అందజేసినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ అలవలపాటి ముకుందా రెడ్డి తెలిపారు. వీరికి ప్రత్యేక దర్శనం చేయించి తీర్థ, ప్రసాదాలు, స్వామివారి చిత్ర పటం, శేష వస్త్రంతో వేద ఆశీర్వచనం అందజేసినట్లు తెలిపారు. అన్ని దానాల కన్నా అన్నదానం గొప్పది అని చందంగా గండి క్షేత్రంలో నిత్య అన్నదానానికి విరాళాలు అందించిన భక్తులకు పేరుపేరునా వారు కృతజ్ఞత అభినందనలు తెలిపారు.



చిన్నారులతో అంగన్వాడీ కార్యకర్తలు

చిన్నారులను అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించాలి

ప్రజాశక్తి -ఖాజీపేట

ప్రతి చిన్నారిని మూడేళ్లు పూర్తవ్వగానే అంగన్వాడీ కేంద్రాలలో చేర్పించాలని, అంగన్వాడీ కేంద్రం అమ్మబడి లాంటిదని దుంపలగట్టు అంగన్వాడీ కార్యకర్త జంపన గంగావతి పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని దుంపలగట్టులో 'అంగన్వాడీ పిలుస్తోంది..రా' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రాలలో లభిస్తున్న సేవలను గురించి ప్రజలకు వివరిస్తూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంగన్వాడీ కేంద్రాలలో పోషక విలువలతో కూడిన భోజనం అందించడంతోపాటు ఆటపాటలతో కూడిన విద్యను బోధిస్తారని చెప్పారు. ప్రతి ఒక్కరూ తమ పిల్లలను అంగన్వాడీ కేంద్రాలలో చేర్పించి సేవలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు క్రమశిక్షణతో ఆటపాటలతో కూడిన విద్యను నేర్పిస్తారనిఅన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

23న వార్షిక సర్వసభ్య సమావేశం

కడప అర్బన్ : కడప నగరంలోని మదర్సా-ఇ-జమియాతుస్ సాలిహత్, అల్మాస్‌పేటలో 'అమానత్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ క్రెడిట్ అండ్ థ్రఫ్ట్ సొసైటీ" వార్షిక సర్వసభ్య సమావేశం ఈనెల 23న నిర్వహిస్తున్నట్లు అధ్యక్షులు యస్.ఇషాక్ అలీ చెప్పారు. శుక్రవారం సొసైటీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని తెలిపారు. సభ్యులందరూ హాజరుకావాలని కోరారు.

ఖాదర్‌పల్లిలో టిడిపి సంబరాలు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని ఖాదరపల్లి గ్రామంలో శుక్రవారం టిడిపి నాయకులు, మాజీ సర్పంచ్ నాయబ్ రసూల్ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పుట్టా సుధాకర్ యాదవ్ ఎమ్మెల్యేగా విజయం సాధించడం పట్ల ప్రజల్లో ఆనందం వ్యక్తం అవుతుందన్నారు. పేదల అభ్యున్నతే ధ్యేయంగా కృషి చేస్తున్న పుట్టాను అధిక మెజార్టీతో గెలిపించడం సంతోషమన్నారు. ఇన్‌ఛార్జి ఖాదరపల్లి అభివృద్ధికి పుట్టా ఎంతో కృషి చేశారన్నారు. ఎమ్మెల్యేగా మరింత అభివృద్ధికి సహకారం అందిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు ప్రజలు పాల్గొన్నారు.